కథ

మనుషుల్లో కృత్రిమత పెరిగిపోయిందనేది వాస్తవం. తమకేం కావాలో తెలుసు. ఏం అక్కర్లేదో కూడా తెలుసు. ఏది కావాలో దాన్నొదిలి పెట్టి, లేని అవసరాన్ని సృష్టించుకుని దానికోసం అవస్థపడటం జీవనశైలిగా మారిన నేపథ్యంలో-

# సింధూరి

ముందురాత్రి క్రిస్టల్ పేలస్‌లో జరిగిన పార్టీ గురించి రావు అడిగిన ప్రశ్న- ''బాగా ఎంజాయ్ చేసాం కదూ?'' అని. అది గుర్తొచ్చింది నరేంద్రకి. వెంటనే పార్టీనేమాత్రం ఎంజాయ్ చెయ్యలేకపోయిన సింధూరి కూడా గుర్తొచ్చింది.

ఇద్దరూ అలా వెంట వెంటనే గుర్తొచ్చారంటే వాళ్ళిద్దరికీ ఏదో సంబంధం వుందని కాదు, ఒకే విషయం మీద యిద్దరి స్పందనలోగల వైరుధ్యం.

సింధూరి నరేంద్రని చూసీ చూడనట్టు చూసింది. ఆమె కళ్ళలో అదే నిర్లిప్తత. అదే డిటాచిమెంటు. హోరెత్తిపోతున్న సంగీతం మధ్య యిమడలేక సుదూరతీరాల్లో ఎక్కడో ఏదో వెతుక్కుంటూ వలసపోయిన మనసు. అదిలేక ప్రాణమున్నా జీవం లేని శరీరం. దాన్ని లయబద్ధంగా ఆడిస్తున్న ఆమె భర్త- దిలీప్. దిలీప్ నరేంద్రని చూసి ఎవరో తెలీనట్టు ముఖం తిప్పుకున్నాడు. అతనో పెద్ద కేరికేచర్.

''ఎంజాయ్డ్ ఏ లాట్..కదూ?'' రావు ప్రశ్న మళ్ళీ గుర్తొచ్చింది నరేంద్రకి.

ఇద్దరూ కోప్రొఫెషనల్స్. సైకియాట్రీ లైన్లో వుంటూ ఒకరికొకరు పోటీ కాకుండా ఒక విధమైన స్నేహాన్ని దాదాపు పదేళ్ళనుంచీ మెయింటేన్ చేస్తున్నారు. డాక్టర్లకి వృత్తిపరంగా పోటీపడాల్సిన అవసరం ఎప్పుడో తప్పిపోయింది. వాళ్ళ వృత్తిలోకి వ్యాపారదృక్పథం ప్రవేశించడంతో ఎవరి సర్కిల్ వాళ్ళకుంటుంది. ఆ సర్కిల్లో కొందరు పేషంట్సు, వాళ్ళ సర్కిల్స్.. అన్నీ ఆవృతవృత్తాలు. ఒక్కోసారి ఈ పేషెంట్లు ఒక డాక్టర్నించీ యింకో డాక్టరుకి మారతారు. అలా ఎందరో డాక్టర్లని మార్చి వచ్చిందే సింధూరి.

సింధూరి! పదహారేళ్ళ వయసులో అందరూ అందంగానే కనిపిస్తారు. అది అందం కాదు. ఆ వయసు తెచ్చే ఆకర్షణ. ఆ తర్వాత కూడా నిలిచి వుండేదే అందం. అలాంటి అందం సింధూరిది.

ఆమెని మొదటిసారి చూడగానే నరేంద్ర మనసు పగ్గాలు తెంచుకుని ఎక్కడికో ఎగిరిపోయింది. సుతారంగా విచ్చుకునే మొగ్గలూ నిశ్శబ్దగీతాలూ గుర్తొచ్చాయి. కాలేజి రోజులప్పటి అసంపూర్ణ ప్రేమచిత్రాలు, వాటి పరిపూర్ణతని పెళ్ళిలో వెతుక్కోవడం, అది దొరికిందో లేదో తెలీని సందిగ్ధత. అన్నీ మెరుపుల్లా మెరిసాయి. అలాంటి సింధూరిని నరేంద్ర దగ్గరకి ట్రీట్‌మెంటు కోసం తీసుకొచ్చాడు ఆమె భర్త.

''అయామ్ దిలీప్. ఇంజనీరింగ్ కాలేజిలో లెక్చరర్ని'' అని తనని తను పరిచయం చేసుకుని ఆమెని కూడా తనే పరిచయం చేసాడు. ఆమె తన దగ్గర కొచ్చిందంటే అదో అపశృతిలా అనిపించింది నరేంద్రకి. ఆమెని పరిశీలనగా చూసాడు. మొహంలో ఒక రకమైన నిరాసక్తత కనిపిస్తోంది. రోగ లక్షణాల కోసం వెతికాడు. అలాంటివేం కనిపించలేదు.

భర్తే ఆమె సమస్యా?

చాలామంది గుర్తించరు గానీ మనసులు కలవన-



యస్.శ్రీదేవి

ప్పుడు భార్యాభర్తలే ఒకరికొకరు పెద్ద హెడేకౌ తారు. మనసులు కలవటమంటే ప్రేమ పుట్టడం లాంటి ఎబ్స్ట్రాక్ట్ థింగేం కాదు. భార్యాభర్తల మధ్య కంపేటిబులిటీ వుంటుంది. ఒకరి అభిరుచులు, మనోగతభావాలూ మరొకరికి అర్థమై సంఘర్షణేం లేకుండానే వాటిని మననిస్తారు. లేకపోతే ఏముంది? వ్యక్తిగ అస్తిత్వం కోసం యిద్దరూ సంఘర్షిస్తారు. సంసారం సాగాలంటే ఎవరో ఒకరు తగ్గాలి. ఈ తగ్గటమనేది ఎప్పుడూ ఎవరో ఒకరి వంతే అయితే ఆ అసంతృప్తి నిత్యకృత్యమే.

## అలాంటిదేం లేదు

**నటీనటులకి ఎవరికుండే ఇమేజ్ వారిది. అయితే కొంతమంది హీరోయిన్స్ మాత్రం తమ తోటి హీరోయిన్స్ ఇమేజ్‌ని చూసి అసూయ చెందుతుంటారు. అలాగే ఎక్స్‌పోజింగ్ విషయంలో బరితెగించిందన్నట్టుగా మాట్లాడతారు. 'నాకూ బంటీకి ఉన్న సంబంధం చాలా ఉన్నతమైంది. మా మధ్య ఏదో జరిగిందంటూ బంటీ నేహా దూఫియాతో తిరుగుతున్నట్టు చెబుతున్నారు. రెండేళ్లనించీ మా ఇద్దరిమధ్య స్నేహం మాత్రమే ఉంది. ఇద్దరి మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవు' అని వివరణ ఇస్తోంది అందాలభామ దియామీర్జా. 'నేహా నాకు ఫ్రెండ్. అంతేగానీ మేమిద్దరం శత్రువులం కాదు'. అని కూడా అంటోంది.**

తన పదేళ్ళ అనుభవంలో ఎన్నో కేసులు చూసాడు నరేంద్ర. హిస్టీరియా కేసులు..డిప్రెషన్ కేసులు..ఎన్నని? వచ్చాక వైద్యం చేయించుకోవడం సరే! రాకుండానే ఎందుకు చూసుకోరని? మారుతున్న జీవనశైలి...పెరిగిపోతున్న సెల్ఫ్ సెంటర్డ్‌నెస్..మనిషికీ మనిషికీ మధ్యనగల అవగాహనలేమి..వత్తిడి..మెదడు రిలీజ్ చేసే ఎంజైమ్స్..కేన్సరుకేనా, గుండెజబ్బులకేనా, సైకిక్ ప్రాబ్లమ్స్‌కేనా కారణాలివే!

పగలూ రాత్రీ భేదం లేకుండా ట్రాంక్విలైజర్స్ మత్తులో కొట్టుకునే కేన్సరు పేషెంట్లు..పగలూ రాత్రీ భేదాన్ని గుర్తించలేనంత నిరాసక్తతలో కూరుకుపోయే డిప్రెషన్ పేషెంట్లు..ఇదేనా, యిరవయ్యో శతాబ్దాంతపు ప్రగతి? గుండెల్లో గుచ్చుకున్నట్లైంది నరేంద్రకి. సింధూరి అతన్నంతగా కదిల్చింది.

దిలీప్ పాత రిపోర్ట్స్ చూపించాడు. వాటిని చదివాక-

''ఆమెని టెస్ట్ చెయ్యాలి. మీరు కొద్దిసేపు బైట వెయిట్ చెయ్యండి'' అని సున్నితంగా సూచించాడు నరేంద్ర. వెళ్తూ అతను చూసిన చూపుల్లో అన్నీ నేనే చెప్పాను. ఇంకా మీరు అడిగేదేంటనే భావం వ్యక్తమైంది.

అతను వెళ్ళగానే చెప్పింది సింధూరి, ''నాకెలాంటి జబ్బూ లేదు. మీరనవసరంగా శ్రమపడకండి డాక్టర్. రాయాలనుకున్న మందులేవో రాయండి. లేని రోగానికి మందుండదు గాబట్టి తగ్గలేదని మరో డాక్టరు దగ్గరకి వెళ్తాం'' ఆ చెప్పడంలో ఎంతో స్పష్టత వుంది.



ఆమె చెప్పిన విషయం నరేంద్ర వూహించినదే అయినా అంత ఓపెన్‌గా చెప్తుందనుకోలేదేమో, షాకయ్యాడు. ఐనా వెంటనే తేరుకుని ''ఎందుకని యిలా?'' అని అడిగాడు.

''మీ దగ్గరకొచ్చిన వాళ్ళందర్నీ యిలాగే అడుగుతారా?''

''అడిగి చెప్పించుకోకపోతే సమస్య ఎలా తెలుస్తుంది? అది తెలుసుకోకుండా నేను వైద్యం ఎలా చేస్తాను?'' నరేంద్ర మెత్తగా నవ్వాడు. ఆమె లోతుగా చూసింది. ఆమెలో ఒక విధమైన పరిపూర్ణం కనిపించిందతనికి.

''వినండైతే. కొంత వ్యక్తిగతం. కొంత సామాజికం''

''వివరంగా చెప్పండి. సైన్సులో ప్రతిదానికీ నిర్దుష్టమైన పేరుంది. అలా పేరుపెట్టగలిగితే వైద్యం తేలిక. ఉదాహరణకి..దేన్నైనా చూసి అనవసరంగా భయపడ్తే ఫోబియా అంటారు. అతిగా దేన్నైనా యిష్టపడితే మేనియా అంటారు. లైక్ దట్..''

సింధూరి కొద్దిసేపు మౌనంగా వుంది. తలొంచుకుని గోళ్ళు చూసుకుంది. తలెత్తితే ఎదురుగా నరేంద్ర కనిపించాడు. అతనిమీంచి పైకి చూస్తే గోడకి చక్కటి సీనరీ కనిపించింది. దానిమీద దృష్టి నిలిపింది. మళ్ళీ మామూలుగా కూర్చుని అడిగింది, ''గుండె మార్పిడి చాలా కాలంగా చేస్తున్నారు. ముఖాన్ని కూడా మారుస్తున్నారని యీమధ్య చదివాను. అలాగే పెళ్ళయ్యా అవగానే ఆడపిల్లకి మనసు మార్పిడి చేసే ప్రక్రియ ఏదైనా లేదా?''

ఇదీ నరేంద్ర వూహించినదే. ఆమె చాలా సన్నిహితంగా అనిపించింది. తమ మధ్య సంభాషణ ప్రొఫెషనలిస్టిగ్గా కాకుండా ఆంతరంగికమైన యింటరాక్షన్‌గా మారటాన్ని గుర్తించాడు.

చాలా క్లుప్తంగా తన గురించి చెప్పింది. ''ఎమ్‌టెక్ చదివి అతను, ఎమ్మే చదివి నేనూ పెళ్ళిచూపుల్లో ఒకరినొకరం చూసుకుని ఇష్టపడి చేసుకున్నాం. బేసిగ్గా మా యిద్దరి ప్రవృత్తులూ వేర్వేరనే విషయం మా పెళ్ళయ్యాకే అర్థమైంది. అతను చాలా సందడి మనిషి. రాప్ మ్యూజిక్కూ, స్టీరియో డాన్సు, ఫ్రెండ్సు, పార్టీలు అతనికిష్టం. లోవాయిస్‌లో క్లాసికల్ మ్యూజిక్ వింటూ ఏ పుస్తకమో చదువుకోవటం నాకిష్టం. అతని అభిరుచుల్ని నేనూ యిష్టపడాలని కొంత ప్రయత్నించాను. కనీసం అలా నటించాలని ప్రయత్నించాను. ఊహూ... నటన అనేది ఎల్లవేళలా సాధ్యపడే విషయం కాదు. నేను మౌనంగా వుంటే డిప్రెషనేమోనని అతనికి భయం. వంటరితనానికీ ఏకాంతా

నికీ తేడా తెలీని మనిషి. భావుకతకీ ఎక్స్ట్రావర్షియలి జానికీ భేదం తెలియని వ్యక్తి. నన్నిలా డాక్టర్ల చుట్టూ తిప్పుతున్నాడు'' ఆమె గొంతు వణికింది. ఎవరూ ఆమెనింత వివరంగా అడగలేదు. ఎవరికీ తనూ చెప్పలేదు. ఎవరికి చెప్పినా, ఎంత చెప్పినా అర్థమవదనే నిర్లిప్తత.

నువ్వే మారాలి. నీ పద్ధతులు మార్చుకోవాలి. అతనికనుగుణంగా వుండాలి. ఆమె చుట్టూ ఎన్నో గొంతుల ఘోష. ఆ ఘోష ముందు ఆమె గొంతు వినిపించదు. కానీ దానికి భిన్నంగా తను పడే తప నంతా, నరేంద్ర ముఖంలో కనిపించింది. అందుకే ఆమె గొంతిప్పింది.

పెద్దగా మందులేం రాయలేదు నరేంద్ర. ఆ రాసిన కొంచమేనా దిలీప్ సంతృప్తికోసం. సింధూ రిని మళ్ళీ వెంటనే మరో డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళ కుండా వుంచేందుకు. అతన్ని విడిగా పిలిచి చెప్పాడు.

''కొంతమంది సైలెన్స్ లవర్సుంటారు. అలాం టివారిలో మీ భార్య ఒకరు. ఆమె చుట్టూ ప్రశాం తమైన వాతావరణాన్ని వుంచండి'' అని మను షుల్లో వుండే తేడాలు- వైవిధ్యం నుంచీ వైరుధ్యం దాకా చెప్పాడు.

వెళ్తూ వెళ్తూ దిలీప్ చూసిన చూపు..దానికర్థ మేమిటో తొందర్లోనే తెలిసింది నరేంద్రకి.

రావు ఫోన్ చేసి చెప్పాడు. నీ కేసొకటి నా దగ్గర కొచ్చిందని. అంతే! నిన్నటి పార్టీలో మళ్ళీ చూసా డామెని.

★ ★ ★

''ఎంజాయ్డ్ ఎ లాట్..కదూ?'' అని కదా, రావు ప్రశ్న. నరేంద్ర ఆలోచనలు స్మృతిపథంలో విశ్వభ్రమణంలాంటిది చేసి, మళ్ళీ అక్కడికొచ్చి ఆగాయి. అలసిపోయిన మెదడు ఇంక ఆలోచించ నని మొరాయించింది.

చిన్న డైవర్షను.

ఫోన్ మోగింది. నరేంద్ర భార్య, నీరజ. గైనకా లజిస్టు. ఇంట్లో మాట్లాడుకోవడానికి తీరికలేక వదిలేసిన విషయాలని క్లినిక్‌లో కూర్చుని టైమ్ దొరికినప్పుడు మాట్లాడుతుంది. రావు ప్రశ్నని ఆమెకి ట్రాన్స్‌ఫర్ చేసి జవాబు రాబట్టాలనిపిం చింది.

''నీరజా! నిన్నటి పార్టీ బావుందా? ఎంజాయ్ చేసావా?'' అడిగాడు అడిగాక అనిపించింది, అలా అడగకుండా వుండాల్సిందని. అసంబద్ధంగా వుందని.

''కొత్తగా అడుగుతున్నావేంటి నరేన్? నాకీ పార్టీ లవీ నచ్చవని నీకు తెలుసుగా? కృష్ణమోహన్‌గారు యిన్వైట్ చేసాక బావుండదని వచ్చాను. ఆయన కంపెనీల్లో మనకి షేర్లున్నాయి. డీలింగ్స్ స్మూత్‌గా వుండాలని..'' అతనలా ఎందుకడిగాడో ఆమెకి అర్థమవలేదు.

''ఏంటి నరేన్. వింతగా మాట్లాడుతున్నావు? ఏం జరిగింది?'' నీరజ గొంతులో ఆతృత. భర్త సెన్సిటివ్‌గా వుంటాడని ఆమెకి తెలుసు. ఎప్పుడు, దేనికెలా స్పందిస్తాడో మాత్రం తెలుసుకోలేకపో తోంది. అర్థమైనట్టే వుంటాడు, అంతలోనే అంద నంత దూరానికి వెళ్ళిపోతాడు.


''నిన్న..సింధూరి కూడా వచ్చింది''

''సింధూరి... అంటే?! ఆ యింజనీ రింగ్ కాలేజి లెక్చరర్ భార్యా? ఆమంటే నీకెం దుకంత యింట్రెస్టు?'' చివర్లో ప్రశ్నించినప్పుడు ఆమె గొంతు తీవ్రంగా వుంది. అందులో కొద్దిగా అసూయ ధ్వనించింది. సింధూరి నీరజకి తెలుసు. విమెన్స్ లిబ్ మీటింగ్స్‌లో పరి చయం ఆపైన నరేంద్ర కూడా చెప్పాడు.

నరేంద్ర, భార్య గొంతులో ఒక్కసారిగా వచ్చిన మార్పుని గుర్తిం చాడు. నవ్వుకున్నాడు. గుండెల్లోంచీ ఎగదన్ను కొచ్చిన ఆర్తి దాన్ని ధ్వనింపనివ్వలేదు. ''ఆమెని చూసినప్పుడల్లా నేను బాగా డిస్టర్బౌతున్నాను నీరజా! ఎందుకో తెలీదు..నా చిన్న తనం...యాంత్రికత పరిచయం లేని నా బాల్యపు పల్లెజీవితం గుర్తొస్తుంది. అప్పుడు భావాలు చాలా స్వచ్ఛంగా ఉండేవి. అవి అచ్చంగా మనవే. ఎవరో బలవంతంగా కరిగించి మన చెవుల్లో పోసినవీ, మన మీద రుద్దినవీ కావు. మన వికాసం కోసం మన మనసులు సృష్టించినవి. అవన్నీ ఏ కాలగర్భంలో కలిసిపోయాయోననే వెతుకులాట మొదలౌ తుంది నాలో..'' అతని గొంతు వణికింది.

అతని గురించి తెలిసే అలా మాట్లాడినందుకు ఆమెకి చిన్నతనం వేసింది.

సుదీర్ఘంగా నిశ్వసించింది నీరజ. అతనే మిటో? ఈ ప్రొఫెషన్‌కి సరిపోడు. పేషెంట్లకి బదులు తనే పేషెంటయ్యేలా ఉన్నాడు. ''రోజులు మారలేదా నరేన్? ఆ మార్పు మనం కోరి తెచ్చుకు



## బిపాషా బిజీ

ఒంపుసొంపులతో అదరగొట్టే బిపాషా ఇప్పుడు అందరి హాట్ ఫేవరేట్ అయిపోయింది. ప్రీతిష్‌నందీ కమ్యూనికేషన్స్ కొత్త చిత్రం 'సాహిబ్ బీవీ ఔర్ గులాం'లో ఆమె కూడా నటిస్తున్నట్టు వార్తలొచ్చాయి. సంజయ్‌దత్, వివేక్ ఒబెరాయ్ ఈ చిత్రంలో నటిస్తున్నారు. వీరితో పాటూ ఇప్పటికే ఖరారైన ఐశ్వర్యారాయ్‌కి తోడు ఈమె కూడా మరో హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె వ్యక్తిగత కార్యదర్శి కూడా ఈ విషయాన్ని నిర్ధారించాడు. ఇదిలా ఉంటే ఇదే సంస్థ నిర్మిస్తున్న గులెల్ చిత్రంలో కూడా ఆమె నటిస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలకోసం మరికొంతకాలం ఆగాల్సిందే.

న్నదేగా? అందులో ఇమడక తప్పదు. సమాజానికి అనుగుణంగా మన కదలికలూ ఉండాలి. గతి మార్చుకుని సంఘర్షించడం దేనికి? అందరూ పొందే దాంట్లో ఒకప్పుడు మనం ఆనందాన్ని పొందలేదా? ఇప్పుడెందుకు మనని మనం మినహాయించుకోవాలి? ఒకప్పుడు సోల్‌తో ఎంజాయ్ చేసేవాళ్ళం అనుకుంటా. ఇప్పుడు సెన్సెస్‌తో చేస్తున్నాం. ఎందుకీ ఆలోచనలన్నీ? ఉంటాను. ఎవరో వచ్చారు. బై..'' అని ఫోన్ పెట్టేసింది.

నీరజ కట్ చేసిన వెంటనే రావు చేశాడు. ''చాలాసేపట్నుంచీ ట్రై చేస్తున్నాను. ఎంగేజ్ వస్తోంది'' అన్నాడు వెంటనే.

''సాయంత్రం నువ్వు ఫ్రీయా?'' అనడిగాడు.

''ఎందుకు?''

''అమృతాలోకి మీనాకుమారి పిక్చరొచ్చింది. నువ్వు కంపెనీ ఇస్తావేమోనని''

''వెరోనిక?'' నరేంద్ర అడిగాడు. వెరోనిక రావు భార్య.

''తనని తీసుకెళ్లడానికి నాకేం అభ్యంతరం లేదుగానీ తనకే నాతో రావడానికి అహం అడ్డుపడుతుంది'' రావు నవ్వేడుగానీ వాళ్లిద్దరి మధ్యా సత్సంబంధాలు లేవని నరేంద్రకి తెలుసు. వాళ్లిద్దరి మధ్యా గల గేప్‌ని పూరించాలని ప్రయత్నిస్తాడు. మంచి సినిమా, మంచి పుస్తకం, చిన్న ప్రయాణం కలిసి పంచుకున్న అనుభూతి అగాధానికి అటూ ఇటూ ఉన్న మనుష్యుల మధ్య వారధి ఔతుంది. కానీ రావు రావే.. వెరోనిక. ఆమె గురించి నరేంద్రకి సందిగ్ధం.

''ఈ ఆడవాళ్ళు మననెప్పుడర్థం చేసుకుంటారో. వాళ్లకి కావలసిందల్లా సోషల్ సెక్యూరిటీ, సెటిల్డు లైఫ్, భర్త, పిల్లలూ వుంటే చాలు. వాటికన్నిటికీ మూలకారణమైన సెక్స్ పట్ల అనాసక్తి. కానీ మగవాడిలో ఉండే తృష్ణ?'' రావు తనే అన్నాడు మళ్ళీ.

''నీ ఆలోచనలో తప్పుందేమో?'' కొంచెం సంకోచిస్తూ అన్నాడు నరేంద్ర.

''సోషల్ సెక్యూరిటీ, సెటిల్డ్ లైఫూ మనక్కూడా కావాలిగా? కొన్ని కావాలనుకున్నప్పుడు ఇంకొన్నిటి పట్ల ఆసక్తి తగ్గించుకోవాలి.

''పురాణాలే బెటర్ నన్నడిగితే. కృష్ణుడికి ఎనిమిదిమంది, అర్జునుడికి నలుగురు, ధర్మరాజుకీ ఇద్దరు. ఆ మాటకొస్తే ఒకరితో సర్దుకున్నది ఎవరంట? రాముడికి కూడా తక్కువెందుకు చెయ్యాలని క్లైమాక్స్‌లో వేదవతిని తగిలించారు. మగవాడిలో ఉన్న తృష్ణకి ఒక స్త్రీయేం చాలుతుంది?''

నరేంద్ర నిట్టూర్చాడు. రావు రావే. అప్పటికీ ఇప్పటికీ ఏం మారలేదు. అప్పుడు క్రేజీ బోయ్ ఇప్పుడు ఉమనైజరు. పెళ్లయ్యాక ఈ కొత్త స్టేటసొచ్చింది.

''సరే గానీ నిన్నటి పార్టీ నువ్వెంజాయ్ చేశావా? సోల్‌తోటా, సెన్సెస తోటా?'' కొద్దిగా తటపటాయిస్తూ అడిగాడు నరేంద్ర.

రావ్ బిగ్గరగా నవ్వేశాడు.

క్రమంగా అతని నవ్వు సన్నగిల్లింది.

''చాలా లోతైన ప్రశ్న నరేన్. ఎందుకు ప్రతీదీ నువ్వింత లోతుగా ఆలోచిస్తావు? నీకూ్కడా ట్రీట్‌మెంట్ కావాలి. నా దగ్గరకోసారి రాకూడదూ?'' మళ్లీ నవ్వు.

తర్వాత కొద్దిపాటి నిశ్శబ్దం. ఆపైన తుపాను వెలిశాక చల్లటి గాలి మంద్రంగా వీచినట్టు వినిపించింది రావుగొంతు. ''మనం దేన్నీ సోల్‌తో ఎంజాయ్ చెయ్యటం మానేసాం. కనీసం మనసుతో కూడా. అందుకే ఇంత అసంతృప్తి. దాన్ని చల్లార్చాలన్న ఆరాటం. షాంపేన్ కిక్స్‌లాంటి పార్టీలు. తర్వాతి హాంగోవర్లు..మళ్లీ కిక్స్‌కోసం వెదుకులాట. అంతా బిజీ బీజీ.. ఏదీ ఆలోచించకూడదు. ఆలోచిస్తే ఏముంది? ఇంకేదో కావాలనిపిస్తుంది. మనకి దొరుకుతున్నదిదే. దీంతోనే సంతృప్తి చెందాలి'' అని ఆగి, ''పెరుగుతున్న మన ప్రాక్టీస్ చెప్పడం లేదా నరేన్ ప్రస్తుతపు సమాజ పరిస్థితి?'' అనడిగాడు.

''నువ్వు సింధూరి కేసు స్టడీ చేసావా?'' నరేంద్ర ప్రశ్న- ఏదో శోధించాలని.

''ఆమెకేమీ లేదు. పెర్ఫెక్ట్లీ ఓకే. భార్యాభర్తలు ఉత్తర దక్షిణ ధృవాలు. బలం అతనిది కాబట్టి ఆమె వంగుతోంది. అతను ఇనుపచువ్వ. ఆమె గాలి తెమ్మెర. అతను నాకు ముందే పరిచయం. ఆమె ఇప్పుడు పరిచయమైంది'' రావు నవ్వు.

నరేంద్ర కోపంగా ఫోన్ పెట్టేశాడు. రావు దృష్టిలో ఏ స్త్రీ పడకూడదు. పడితే మాత్రం అమూలాగ్రం చదివేస్తాడు.

★ ★ ★

తర్వాత రావు కార్లో సింధూరి కనిపించింది నరేంద్రకి నాలుగైదుసార్లు. ఆఖరిసారి వాళ్లిద్దర్నీ సిటీ ఔట్‌స్కర్ట్స్‌లోని గెస్ట్ హౌస్ దగ్గర చూశాడు. ఈమధ్యలో నరేంద్ర ఆమెని గురించి ఇంకొంత తెలుసుకున్నాడు. ఈ మాట రావు అనే మాధ్యమం ద్వారా.

బెల్లీక్వీన్స్, బస్ట్ ప్రిన్సెస్‌లూ అంటుందంట

## తీరే వేరులే!

**ఒకప్పుడు సినిమా ఇండస్ట్రీలో తారలు అంటీ ముట్టనట్టుగా ఉండేవారు. షూటింగ్‌లో తమ పాత్రలేమిటో అక్కడి వరకే ఉండి చాలా హుందాగా తమ పని తాము చేసుకుపోయేవారు. ఇప్పుడు తీరే వేరు. తాము నటిస్తున్న సినిమాల గురించి కంటే తమ వ్యక్తిగత ఇష్టాయిష్టాల గురించే ఎక్కువగా చర్చించుకుంటున్నారు. ఇషాకొప్పీకర్, అఫ్తాబ్ శివదాసానీ ఇప్పుడు చాలా సన్నిహితంగా మెలుగుతున్నారు. ఎక్కడున్నా ఒకరినొకరు సెల్‌ఫోన్లలో సంప్రదించుకుంటూ క్షేమసమాచారాలు తెలుసుకుంటున్నారుట. అవుట్‌డోర్స్‌లో ఉండి ఎవరికీ డిస్టబెన్స్ లేకుండా ఎస్‌ఎంఎస్‌లిచ్చుకుంటున్నారు. సెల్‌ఫోన్లు వీరి మధ్య దూరాన్ని తగ్గిస్తున్నాయన్నమాట.**



సింధూరి మోడల్స్‌నీ, ఫిల్మ్ స్టార్స్‌నీ. ఆమెకి సంపెంగ పూవులంటే ఇష్టమట. రావు వాటిని విజయవాడ నుంచి ప్రత్యేకంగా తెప్పిస్తే తెలిసింది. బాలసరస్వతి గొంతన్నా, మల్లీశ్వరిలో పాటలన్నా ప్రాణమట ఆమెకి. రావు దగ్గర ఆ కలెక్షన్ కొత్తగా చూశాక అర్థమైంది.

ఇంతలో- సింధూరి ఆత్మహత్య చేసుకుందని రావే హఠాత్తుగా ఫోన్ చేసి చెప్పాడు.

నరేంద్ర షాక్ అయ్యాడు. గుండెల్నిండా దుఃఖం నిండిపోయింది. పేషెంటులా అనిపించలేదు. ఆమె అతనికి తనలోని అంతర్గత సంఘర్షణే ఆమెగా రూపుదిద్దుకుని పరామర్శించడానికి వచ్చిందనిపించింది. ఎందుకు చనిపోయిందామె? రావుతో కలిసి ఔచిత్యపు హద్దు దాటినందుకా? అందుకు అంతరాత్మ ఒప్పుకోలేదా? రాజీ పడలేక పోయిందా?

నరేంద్ర ఈ అన్వేషణలోంచీ ఇంకా బైటపడనేలేదు. ఇంతలో మరో కాల్, రావు దగ్గర్నుంచీ.

''నేను ప్రాక్టీస్ వైండప్ చేసేసి యూకే వెళ్లిపోదామనుకుంటున్నా'' నరేంద్ర విస్మయ చకితుడయ్యాడు.

''రావ్!'' అప్రయత్నంగా అన్నాడు.

''మనం డబ్బు సంపాదిస్తుంటాం అవసరానికి. ఒక్కోసారి అవసరాన్ని మించి కూడా. భార్యాపిల్లల కోసం అనే కారణాన్ని దానికి ఆపాదిస్తాం. అఫ్‌కోర్సు. నాకు పిల్లల్లేరనుకో. నువ్వు వెరోనికాని చూశావుగా? వంటిమీద వీసమెత్తు అలంకారం కూడా చేసుకోని ఆ ప్యూర్ రోమన్ కేథలిక్కు-కోసం నేను సంపాదిస్తున్నాననడం ఎంత రిడిక్యులస్‌గా ఉంటుంది. జస్ట్ రిడిక్యులస్!'' రావు విషాదగీతంలా పలుకుతున్నాడు.

''......''

''ఇన్ఫాంట్ జీసస్ అనే ఆర్ఫనేజిలో ట్యూటర్‌గా అప్లై చేసింది తను. ఆర్డర్సొచ్చాయి. నాకోసం తన పేరెంట్సునీ, దేశాన్నీ వదులుకుని వచ్చేసిన వెరోనికా జాబొచ్చేదాకా నాకీ విషయాన్ని చెప్పలేదు. అన్నీ ఏర్పాట్లూ చేసేసుకుని ఆఖర్లో చెప్పింది. నేనొట్టి డబ్బు మనిషిననుకుంది. తనపట్ల ప్రేమ చచ్చిపోయిందనో, తనకన్నా నా ఎఫైర్స్ ముఖ్యమనో అనుకుంది. తన దారిన తనని పొమ్మంటాననుకుంది. నేను ప్రాక్టీస్ వైండప్ చేసి తనతో వస్తాననేసరికి స్టన్నైంది. నరేన్...మనం డబ్బు సంపాదించేది మన ఇగో సాటిస్ఫాక్షన్ కోసం ఆస్తులు సంపాదించినా, భార్యకి నగలు చేయించినా సొసైటీలో మనని మనం ఎలివేట్ చేసుకోవడానికే. కానీ చాలామంది ఆడవాళ్ళు ఆత్మలతో మాట్లాడుతుంటారు. అంతరంగాలతో అల్లుకుపోతుంటారు. మనసులతో పరితపిస్తుంటారు. భర్త ఇచ్చే నిలువెత్తు ధనంకన్నా అతని కొనగోటి ప్రేమ స్పర్శకోసం కలవరించి పోతుంటారు''

''........''

''నాకు సింధూరి దుఃఖం అర్థమైంది. అందుకే వెరోనికాని కాస్త ఆలస్యంగానైనా అర్థం చేసుకున్నాను. యూకే వెళ్ళిపోతున్నాను ఆమెననుసరించి. అక్కడికెళ్ళాక ఆలోచిస్తాను. తర్వాతేం చెయ్యాలో?''

ఎవర్‌గ్రీన్ హీరోలా ఉండే రావు అస్త్రసన్యాసం చేసి అర్జునుడిలా వైరాగ్యంగా అనిపించాడు నరేంద్రకి. ఐనా ఒక విషయాన్ని మర్చిపోలేదు. అది సింధూరి గురించి. అతని మనసు చదివినట్టు చెప్పాడు రావ్.

''సింధూరిలో కొన్ని సప్రెస్డ్ ఎమోషన్స్ ఉన్నాయి. వాటిని నేను టచ్ చేశాను. అవి ఉవ్వెత్తున లేచాయి. వాటి తాకిడికి ఆమె తట్టుకోలేకపోయింది. నరేన్... ఇందులోని పెద్ద ఐరనీ ఏమిటంటే వెడ్‌లాక్‌ని ఛేదించుకుని తను బైటికిరాలేదు. నేనూ వెరోనికాని వదిలిపెట్టలేను. ఆమెకి దిలీప్, నాకు వెరోనికా ఉండగా మా మధ్య ఏర్పడిన బంధానికి నైతికతలేదు. అనైతికబంధాన్ని తట్టుకోవడం సింధూరిలాంటి వాళ్లకి సాధ్యం కాదు. అందుకు చాలా ధైర్యం కావాలి. అయితే ఆమె చాలా సున్నిత మనస్కురాలు'' అన్నాడు.

అతని గొంతులో దుఃఖపు తడి తగిలింది నరేంద్రకి. అదేనా, సింధూరి చావుకి కారణం? నరేంద్రకి ఇంకా పూర్తిగా కారణం అందనేలేదు. ఇంతలో రావు బాంబులా బ్లాస్టయ్యాడు.

''ఆ క్రూకెడ్ ఫెల్లో సింధూరికి బెల్లీడిజైన్స్ కొని ప్రెజెంట్ చేశాడట. చాలా హర్టైంది. ఆమె ఇష్టపడే తెల్ల సంపెంగలూ కావు, ఇష్టంగా వినే దేవగాంధారాలూ కావు. ఎలా భరిస్తున్నారు నరేన్. ఆడవాళ్ళు ఈ హ్యుమిలియేషన్ని? కన్స్యూమరిజం వరదలా ఇవి? బ్యూటీమేకింగ్ బిజినెసా? స్త్రీని అప్ అండ్ డౌన్ కర్వ్స్‌గా, కొన్ని స్పాట్స్‌గా, వినియోగ వస్తువుగా, ఒక శరీరంగా గుర్తించే కల్చర్ లోంచీ ఎప్పటికి బైటపడ్తాం. వాళ్లని భార్యలుగా, తల్లులుగా, మనుషులుగా కాక ఇంకెలా చూడాలనుకుంటున్నాం? చాలా బాధపడింది తను. అవమానంతో దహించుకుపోయింది. కసితోటీ, ఉక్రోషంతోటీ నాకు యాల్డైంది. ఆ తర్వాత చనిపోయింది. ఆ కలయిక ఇద్దరికీ సంతోషాన్నివ్వలేదు. ఇద్దర్లోనూ అపరాధభావన నింపింది. నాకు పరిచయమైన ఏ అమ్మాయితోనూ ఇలా జరగలేదు'' రావు ఇంక చెప్పలేక కట్ చేశాడు.

సింధూరి చావుకి సరైన కారణమేదో అర్థమవ్వక నరేంద్ర మరింత అయోమయంలో పడ్డాడు.

★ ★ ★

రావు యూకే వెళ్ళిపోయాడు. వెళ్లేముందు నరేంద్ర ఇంట్లో భార్యతో కలిసి డిన్నర్ తీసుకున్నాడు.

వెరోనికాలో సాత్వికత ఉంది. స్వభావసిద్ధంగా వచ్చింది. రావులో కనిపించిన వైరాగ్యం అలాంటిది కాదు. ఒకప్పుడతను దక్షిణ నాయకుడు. అమ్మాయిలతన్ని ప్రేమించి వచ్చేవారు. వాళ్లందర్నీ కాదని వెరోనికాని వలచీ వలపించీ చేసుకున్నాడు. తర్వాత కూడా తన జీవనశైలి మార్చుకోలేదు. దేనికీ ఎప్పుడూ చలించలేదు. వెరోనికా నిర్ణయం అతన్ని భయపెట్టింది. సింధూరి చావు అతన్ని మార్చింది. తిన్న ఆటుపోట్లకి వైరాగ్యం వచ్చింది. అన్నీ అనుభవించాక వచ్చిన వైరాగ్యం అంతే.

అతని నిర్ణయాన్ని- కారణం ఏదైనా ప్రశంసించింది నీరజ.

వెరోనికా నరేంద్రతో ఏకాంతం కల్పించుకుని మాట్లాడింది.


''రావు సింధూరిని సెడ్యూస్ చేశాడు. ఆమెని ఆత్మహత్య వైపు డ్రైవ్ చేశాడు. తన ప్రొఫెషన్ని ఇలాంటి ఎఫైర్స్‌తో అతనెప్పుడూ మెడిల్ చేయలేదు. సింధూరి చావు అతని వ్యక్తిత్వం మీద మొదటి మరక. ఇంతదాకా అతని వ్యవహారాలు అతనివే అని వదిలేశాడు. కానీ అతను...అతనొక స్త్రీ చావుకి కారణం అయ్యాడు. అది నేనిచ్చిన స్వేచ్ఛేనేమో'' అంది.

''కానీ నువ్వు వాడినొదిలేసి యూకే వెళ్ళిపోవాలనుకున్నావు'' నరేంద్ర గుర్తుచేశాడు.

మెత్తగా నవ్విందామె. అందులో ఎన్నో అర్థాలు.

''నాకతని ప్రేమలోని తీవ్రత తగ్గిందేమోనని అనుమానం కలిగింది నరేన్. కానీ అలాంటిదేం లేదు. ప్రపంచంలోని దేనికీ లొంగని అతను నా ప్రేమకి లొంగాడు''

''వాడినసలు డబ్బు యంత్రంగా



ఎపుడో మార్చాల్సింది. ఇలాంటి మెటీరియలిస్టులు ఆఖరికి అయ్యేదంతే''

''లేదు. అతన్లోని మానవీయతను చంపకు. అతన్ని క్రిస్టియన్‌గా కన్వర్ట్ చేస్తాను''

నరేంద్ర నవ్వాడు. ''మతం మారితే మంచివాడౌతాడా?'' అతని గొంతులో వ్యంగ్యం.

''మతమంటే నమ్మకం. చేసిన పాపాలన్నీ చెయ్యనిచ్చి ఎప్పుడో చనిపోయాక నరకంలో శిక్షిస్తానంటుంది మీ మతం. చేసిన పాపానికి పశ్చాత్తాపపడి, పరివర్తన పొందమంటుంది మా మతం. రావుకి స్వర్గనరకాల కన్నా, పునర్జన్మల కన్నా మనిషిగా బ్రతకడం మీద నమ్మకం ఉంది'' జవాబిచ్చింది వెరోనికా.

నరేంద్ర తర్కించలేదు. రావుని పీటర్‌గానో, రాబర్ట్‌గానో తెల్లటి దుస్తుల్లో మెళ్ళో శిలువతో ఊహించడం అతనికి సాధ్యపడలేదు.

రావు వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోవడం ఎంతగా బాధించినా నరేంద్ర దినచర్యలో మార్పు లేదు. రోజులు గడిచిపోతూనే ఉన్నాయి.

★ ★ ★

ఒక ఆర్ట్ ఎగ్జిబిషన్లో కనిపించాడు రావు నరేంద్రకి. ఓ ఎగ్జిబిట్‌లో డ్స్కట్రైబ్ దాని పేరు గోధూళివేళ. ఎర్రటి సంధ్య వెలుతుర్లో సిల్‌హౌట్‌లో ఒక యువతి ముఖం. దాన్ని కప్పేస్తూ గాలికెగురుతున్న వెంట్రుకలు. క్రిందని రావు పేరు చూడగానే అర్ధమైంది ఆ బొమ్మ సింధూరిదని. ఉద్వేగ్నతని తట్టుకోలేకపోయాడు. వెంటనే రావ్‌కి ఫోన్ చేశాడు.

''నువ్వింకా ఆమెని మర్చిపోలేదా?''

''ఎందుకు మర్చిపోవాలి?'' ఎదురుప్రశ్న వేసి ''ఆర్ట్ ఎగ్జిబిషన్‌కి వెళ్ళావా?'' అని అడిగాడు.

''వెళ్లకపోతే ఎలా తెలుస్తుంది?''

ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు. రావులో వెనుకటి చురుకుదనం లేదు. మాటల్లో చైతన్యం లోపించింది. నరేంద్రకి తీవ్రమైన బాధ కలిగింది. వెరోనికా అతన్నుంచీ విడిపోయి మళ్ళీ పెళ్ళి చేసుకుందని తెలిసింది.

''ఎలా భరిస్తున్నావు నువ్వింత బాధని, ఎవ్వర్‌గ్రీన్ రావ్?'' అడిగాడు నరేంద్ర. రావు విషాదంగా నవ్వాడు. ''సింధూరికి తన సుఖం నాతోనేనని తెలిసింది. కానీ మా ఇద్దరి దారులూ కలవ్వని ఊహించుకుని చనిపోయింది. వెరోనికాకి నాతో సుఖం లేదని తెలిసిన మరుక్షణాన నా ఇల్లు పరాయిదనిపించింది. విడాకులిచ్చేసి బైటపడింది. ఏ సంతోషం సోల్‌తోటీ మరేదీ సెన్సెస్‌తోటీ అనే సందేహానికి క్కడ చోటులేదు. సుఖసంతోషాలకి నిర్వచనం ఆత్మ, మనస్సులే కాదు దేశకాలపరిస్థితులు కూడా ఇవ్వగలుగుతాయి'' అన్నాడు.

''ఇంకా నువ్వక్కడెందుకు?''

''ఎక్కడ మాత్రం ఏముంది?''

''అంతగా డిప్రెసవ్వకు. నేనూ నీరజా వున్నాం. తిరిగొచ్చెయ్. మళ్ళీ కొత్త జీవితం ప్రారంభించు'' అన్నాడు నరేంద్ర అర్థింపుగా.

''నాకేం కాలేదు. నేను బాగానే ఉన్నాను'' అన్నాడు రావు నవ్వేస్తూ.

వెరోనికా నెంబర్ అడిగి తీసుకున్నాడు నరేంద్ర. ఆమెతో మాట్లాడకుండా ఉండలేకపోయాడు.

''హలో! నరేన్! హౌ ఆర్యూ?'' ఆమె అడిగింది ముందు.

''ఇలా ఎలా చెయ్యగలిగావు?''

''పెళ్ళి నన్ను చేసుకుని, మరొక స్త్రీ కోసం బాధపడ్తుంటే ఏం చెయ్యను? అంతకన్నా ధైర్యంగా నాకు విడాకులిచ్చి, ఆమెనీ తీసుకొమ్మని పెళ్ళి చేసుకునుంటే సంతోషించేదాన్ని. రావు హిపోక్రసీని భరించగలిగే ఓపిక పోయింది నాకు. అతన్లోని ఛార్మ్ పోయింది. ఇప్పుడీ జీవితం చాలా బావుంది. సెంటిమెంట్సు, ఎమోషన్స్ లేవు. ఒకరితో ఒకరం మంచిగా ఉండాల్సిన నైతికబాధ్యత ఇద్దరికీ సమానంగా ఉంది. ఎవరిలో తేడా కన్పించినా ఎవరి దారి వాళ్లది'' అంది.

★ ★ ★

''ఈ సమాజంలోని ఒక వ్యక్తికి ఆత్మహత్యకో డిప్రెషన్‌కో దారితీసే పరిస్థితులు వచ్చాయంటే ఆ లోపం అతనిది కాదు. అతని చుట్టూ ఉన్నవాళ్ళది. సింధూరి చావుకైనా, పతనానికైనా మొదటి కారణం ఆమె భర్త. తర్వాత ఆమె కుటుంబం. ఆపైన చుట్టూ ఉన్న సమాజం. తామివ్వగలిగిందే ఇచ్చారు తప్ప ఆమేం కోరుకుందో ఎవరూ పట్టించుకోలేదు. అసలీ సమాజమే పెద్ద ఎసైలంలా మారుతోంది. బలహీనులు దానినుంచీ తప్పించుకోవడానికి మెంటల్ హాస్పిటల్స్‌లో తలదాచుకుంటున్నారు. మనమేం సంస్కర్తలం కాదు. సమాజాన్ని సంస్కరించడానికి.

నువ్వీ సత్యాన్వేషణ మానేసి ప్రాక్టీసుమీద శ్రద్ధ పెట్టకూడదా నరేన్? పిల్లలు పెద్దవుతున్నారు. ఖర్చులు పెరుగుతున్నాయి. ప్రొఫెషనల్లో పోటీ బాగా ఉంది. ఇదివరకులా నేను అంతంతసేపు నిలబడి అన్నేసి సర్జరీలు చేయలేకపోతున్నాను'' అంది నీరజ కొంత విసుగుని ప్రదర్శిస్తూ.

ఈమధ్య తరచుగా అదే మాటంటోందామె. నువ్వు సంపాదించడంలేదు. ఖర్చులూ, అవసరాలూ పెరిగాయి. నువ్వు సంపాదించకపోవడం నాకు అదనపు బాధ్యత అవుతోందని. అంటేనన్నా మారతాడని ఆమె ఆశ.

''మనకున్నది చాలదా. ఇంకా ఎందుకు సంపాదించాలి?'' అడిగాడు నరేంద్ర.

''సంపాదించక ఏం చేస్తావు? ఆలోచించి ఆలోచించి గెడ్డాలూ, మీసాలూ పెంచుకుని సన్యాసుల్లో కలిసిపోతావా?'' చికాకుగా అడిగింది. అలా అడిగాక ఆమె కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

''డబ్బు సంపాదించలేకపోతే సోషల్ సర్వీస్ చెయ్యి. ఉచితంగా వైద్యం చేయి నరేన్. మనిషన్నాక ఒక ఖచ్చితమైన గమ్యం ఉండాలి. ఇది సాధించాలనే ఆకాంక్ష ఉండాలి. నిన్నిలా వదిలేస్తే ఏమైపోతావో తెలీదు'' అంది రుద్ధస్వరంతో. నరేంద్ర చలించిపోయాడు. సింధూరి మరణం కన్నా, రావు నిర్వేదం కన్నా నీరజ కన్నీరు అతన్ని బలంగా కదిల్చింది.

★ ★ ★

సిటీ సెంటర్లో పెద్ద హాస్పిటల్ కట్టే ప్రయత్నంలో పడ్డాడు నరేంద్ర. అతను, నీరజ ప్రేమించుకోలేదు. పెళ్ళి మాత్రం చేసుకున్నారు. వాళ్ళిద్దరి అభిప్రాయాలు, మనస్తత్వాలూ కలవవు. ఐనా, ఒకరిపట్ల మరొకరికి పూర్తి అవగాహన ఉంది. ఇద్దరూ మంచివాళ్ళు. ఇద్దరు మంచి వ్యక్తులు గొప్ప ప్రేమికులు కాలేకపోవచ్చుగానీ భార్యాభర్తలుగా, తల్లిదండ్రులుగా, సామాజికులుగా సక్సెస్ అవుతారు. హాస్పిటల్ నిర్మాణం పూర్తవుతూంటే నరేంద్ర గుండె ఆనందంతో నిండిపోతోంది. ఎదుగుదల అనునిత్యంగా ఉంటూ ప్రస్ఫుటంగా కళ్లకి కనిపిస్తూ ఉంటే మనిషికి చాలా తృప్తి ఉంటుంది. మానసికంగా ఎదగడంలో ఇప్పటి సమాజంలో ఎన్నో అవరోధాలున్నాయి. అదొక గమ్యంలేని ప్రయాణం. తుదీమొదలూ లేని వెతుకులాట. అందుకే చాలామంది ఇంటలెక్చువల్స్‌లో పెర్వర్షన్ వస్తోంది. ఇంకా చాలామంది మెటీరియలిస్టులుగా మారిపోతున్నారు. నరేంద్ర రెండోదారి పట్టాడు. అలాంటి దారేదీ దొరక్క సింధూరి ఆత్మహత్య చేసుకుంది.

☆

